ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 7 నవంబరు 2025



సింగరేణి పర్సనల్ మేనేజర్ బదిలీ

కృష్ణకాలనీ,నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి బదిలీ అయ్యారు. ఈ మేరకు సింగరేణి సంస్థ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఆగస్టు 14న ఇక్కడ ఆయన బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి ఏరియా నుంచి బెల్లంపల్లి ఏరియాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో మందమర్రి ఏరియాలో పర్సనల్ మేనేజర్ పనిచేస్తున్న శ్యాంసుందర్‌కు భూపాలపల్లికి బదిలీ చేశారు.

నిండా నష్టం



పక్కకు పడి ఉన్న మూల స్తంభం





మేడారం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్తంభాన్ని తొలగిస్తున్న క్రమంలో ధ్వంసమైన సోలార్ విద్యుత్ పలక, మట్టిలో గోమాత విగ్రహం

- అడ్డగోలుగా మేడారం అభివృద్ధి పనులు
- జాగ్రత్తలు పాటించని కాంట్రాక్టర్
- ప్రణాకలు లేక తీవ్ర నష్టం
- పట్టించుకోని అధికారులు

ములుగు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారలమ్మ సన్నిధి మేడారంలో శాశ్వత పనులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. ప్రతి రెండేళ్లకో సారి జరిగే మహాజాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెస్తోంది. వందల ఏళ్లపాటు చెక్కు చెదరకుండా శాశ్వతంగా నిలిచేలా అభివృద్ధి చేపడుతోంది. ఇందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను రూపొంచి అందుకు అనుణంగా పునరుద్ధరణ పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల స్థల మార్పులతో పాటు సమ్మక్క -సారలమ్మల గద్దెల పునర్నిర్మాణం, ప్రాకారం పునరుద్ధరణ, ఇన్ అండ్ ఔట్ ఆర్చి గేట్ల నిర్మాణం, వాచ్‌టవర్లు, అంతర్గత డ్రెయినేజీలు, భక్తుల క్యూలైన్లు, వాటిపై షెడ్ల నిర్మాణం, వాటర్ సరఫరా పైప్‌లైన్లు, విద్యుత్ మరమ్మతులు, రోడ్ల విస్తరణ పనులు చేపడుతోంది. ఈ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే.. మేడారం అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాత కట్టడాలను తొలగించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం లేదని తెలుస్తోంది.

రూ.117.5 కోట్లతో అభివృద్ధి పనులు

మేడారం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.117.5 కోట్లు కేటాయించింది. వాటిలో గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల మార్పు, సమ్మక్క-సారలమ్మ దేవస్థాన పునరుద్ధరణ, భక్తుల క్యూలైన్, షెడ్లు, రెండు వాచ్ టవర్లు, ప్రాకారం, ఆర్చి గేట్లు తదితర పనులకు రూ. 71 కోట్లు మంజూరయ్యాయి. రహదారుల విస్తరణకు రూ. 42 కోట్లు, డ్రెయినేజీ పనులకు రూ. 4.50 కోట్లు కేటాయించారు. ఈ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించగా వీటిలో చాలా వరకు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జనవరి 28న మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను 90 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

కనుమరుగైన వృక్ష సంపద

సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పదుల సంఖ్యల్లో మహా వృక్షాలు ఉండేవి. పక్షుల కిలకిల రావాలతో నిత్యం ఆ చెట్లు కళకళలాడేవి. మేడారం అభివృద్ధి పనులు చేపడుతున్న క్రమంలో దశాబ్దాకాలం నాటి మహా వృక్షాలను కాంట్రాక్టర్ తొలగించారు. ఎన్నో ఏళ్లుగా నీడనిచ్చిన చెట్లు కనుమరుగయ్యాయని భక్తులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోజుల్లో అనేక టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించి చెట్లను వేర్లు సహా తొలగించే సురక్షితంగా మరో చోటకు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ఆ మేరకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. చెట్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నా అధికారులు ఏమీ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అడ్డగోలుగా పాత కట్టడాల తొలగింపు

మేడారం అభివృద్ధి పనుల్లో భాగంగా గద్దెల ఆవరణలో, రహదారుల వెంట పాత కట్టడాలను తొలగించారు. అయితే.. వాటిని తొలగించే ముందు అధికారులు, కాంట్రాక్టర్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్దెల సమీపంలోని వాచ్ టవర్లను తొలగించే ముందు వాటిపై ఉన్న రేకులు, వాటర్ ట్యాంక్‌ను తొలగించే క్రమంలో జాగ్రత్తలు పాటించలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అవి ధ్వంసమై ఎందుకూ పనికి రాకుండా పోయాయని తెలుస్తోంది. అదే విధంగా గద్దెల ఆవరణలో ఎంతో కాలంగా ఉన్న గోశాలను తొలగించారని, అక్కడున్న మూల స్తంభం, ఆవు విగ్రహాన్ని ఓ పక్కకు పడేశారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న క్రమంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ స్తంభాలు, సోలార్ పలకలు విరిగిపోయాయని అంటున్నారు. గతంలో ఉన్న భక్తుల క్యూలైన్లు తొలగించే ముందు ఇనుప రాడ్లను, డ్రెయినేజీ పైపులను జాగ్రత్తగా తీసి పక్కకు పెట్టాల్సి ఉండగా అడ్డగోలుగా తీయడంతో అవి పనికి రాకుండా పోయాయని అంటున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్ము మట్టిపాలైందని విమర్శిస్తున్నారు.

కార్మికులకు రక్షణ కరువు

మేడారం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది కార్మికులను కాంట్రాక్టర్ రప్పించుకున్నారు. అయితే.. పనులు చేపడుతున్న క్రమంలో వారికి కనీస రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. కార్మికులు ఇనుప రాడ్లు, చువ్వలు, గునపాలు, గ్రానెట్, విద్యుత్ పరికరాలతో పనిచేస్తుండగా గ్లౌజులు, బూట్లు, టోపీలు తదితర రక్షణ పరికరాలు ఇవ్వకుండా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పని స్థలాల్లో కార్మికులకు సరైన సౌకర్యాలు అందుబాటులోనే ఉన్నాయా? అని చూడాల్సిన కార్మిక శాఖ అధికారులు దృష్టి పెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా పనులు చేస్తున్న కార్మికులు



వరంగల్ స్టేషన్ రోడ్డులో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్ శ్రీలీల

నగరంలో మెరిసిన శ్రీలీల

వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- మూడంతస్థుల్లోని వివిధ విభాగాల్లో సందడి
- 'ఐ లవ్ యూ వరంగల్' అంటూ అభివాదం
- భారీగా తరలివచ్చిన అభిమానులు



అభిమానులకు అభివాదం చేస్తున్న శ్రీలీల

గిర్మాజీపేట(వరంగల్) నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరోయిన్ శ్రీలీల గురువారం వరంగల్ నగరంలో సందడి చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రముఖ వ్యాపార సంస్థ ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఆర్‌ఎస్ బ్రదర్స్ సంస్థ ఛైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ సిర్థ రాజమౌళి, డైరెక్టర్ ప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లో వినూత్న డిజైన్‌ల కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి చీరలను చూపుతూ సందడి చేశారు. మొదటి, రెండో అంతస్థుల్లోని కిడ్స్, పురుషులు, మహిళల డ్రెస్సింగ్ విభాగాలను సందర్శించారు. అనంతరం షోరూమ్ బయట ఏర్పాటు చేసిన స్టేజిపైకి చేరుకోగా, అప్పటికే అక్కడికి తరలివచ్చిన అశేష అభిమానులు కేరింతలు కొట్టారు. వారిని చూసిన శ్రీలీల 'ఐ లవ్ యూ వరంగల్' అనడంతో అభిమానులు కేకలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ ఆర్‌ఎస్ బ్రదర్స్ 15వ షోరూమ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేశారని, ఇక్కడ అందరికీ అనువైన అందమైన దుస్తులు ఉన్నాయని తెలిపారు. 'అబ్బాయిలను ఆర్‌ఎస్ బ్రదర్స్ దుస్తుల్లో (మిగతా 7లో..)

మేడారంలో ఆర్టీసీ పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

తాడ్వాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతరకు జరగనున్న నేపథ్యంలో భక్తుల కోసం ఆర్టీసీ ప్రాంగణ పనులు చేపడుతున్నారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలొమాన్, వరంగల్ జోన్ ఆర్‌ఎం డి.విజయ గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ప్రాంగణం చదును పనులను ప్రారంభించారు. 2026 మహా జాతరకు 4 వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు ప్రయాణ సౌకర్యాల్లో భాగంగా పనులను చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుగులోని జాతరలో జన ప్రవాహం

- దర్శనానికి బారులు తీరిన భక్తులు
- మూడో రోజూ అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్తంభం చెట్టు చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరిలో బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజూ గురువారం భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. దీంతో క్యూలైన్లు కిటికిటలాడాయి. జాతర పరిసరాలు గోవింద నామస్మరతో మార్మోగాయి. భక్తులు పిల్లాపాపలతో తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వనభోజనాలు చేసి ఆనందంగా గడిపారు. గురువారం సుమారు 50 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవోతోపాటు జాతర చైర్మన్ రమణారెడ్డి పర్యవేక్షించారు. జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా డీఎంహెచ్‌వో మధుసూదన్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్వామి ఆరిని మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే 95 ఏళ్ల వృద్ధురాలు ఎవరి సహాయం లేకుండా కొండ పైకి ఎక్కి దర్శనం చేసుకోవడం విశేషం.





గుట్టపై బారులు తీరిన భక్తులు, గుట్ట పైనుంచి జాతర వ్యూ

బీసీ నాయకుల మౌనదీక్ష

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్



అంబేద్కర్ చౌరస్తాలో మౌనదీక్ష చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నేతలు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా ఛైర్మన్ పైడిపల్లి రమేష్ మాట్లాడుతూ జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల కోటాలో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో 10శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకుని అన్ని రంగాలను శాసిస్తూ బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీల రిజర్వేషన్ అమలు చేయకపోతే తెలంగాణ తరహాలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిసెంబరు మొదటి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి పార్లమెంటును ముట్టడిస్తామని అన్నారు. జనవరి నాలుగో వారంలో లక్షమందితో 'వేల వృత్తులు, కోట్ల గొంతులు' నినాదంతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మౌనదీక్ష కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం ఛైర్‌పర్సన్ మేకల రజిత, డిఎస్‌పీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తూరి రవీందర్, నాయకులు ఇస్తారి, సాంబమూర్తి, బండారి రవి, శేఖర్, మహేందర్, వెంకన్న, రవీందర్, శ్రీరాములు, పూర్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లెంకలగడ్డలో కలెక్టర్ పర్యటన

- సుడిగాలి బీభత్సం ఘటనపై ఆరా
- పంటలు, అటవీ ప్రాంతం పరిశీలన
- బాధిత రైతులకు భరోసా

మహాదేవపూర్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని లెంకలగడ్డ శివారులో సుడిగాలులు సృష్టించిన బీభత్సంతో చోటుచేసుకున్న నష్టాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ గురువారం పరిశీలించారు. లెంకలగడ్డలో పర్యటించిన ఆయన సుడిగాలి దాటికి చెల్లాచెదురైన పత్తి, మిర్చి పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. విపత్తు సంభవించిన సమయంలో అక్కడున్న రైతులను సంఘటనపై ఆరా తీశారు. లెంకలగడ్డ-పంకెన ప్రధాన రహదారి నుంచి సంఘటన స్థలంలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు సరైన మార్గం లేకపోవడంతో అక్కడికి కలెక్టర్ బైక్‌పై వెళ్లారు. ఏ పంట ఎన్ని ఎకరాల్లో నష్టపోయిందో త్వరితగతికన నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోర్నడో లక్షణాలున్న ఈ సుడిగాలికి నష్టం వాటిల్లిన పంటల వివరాలు సేకరించి రైతులకు ప్రత్యేక పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

బండలవాగు వైపు సుడిగాలికి ధ్వంసమైన అడవిని డీఎఫ్‌వో నవీన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వేర్లు సహా కుప్పకూలిన వృక్షాలతోపాటు కొమ్మలు విరిగిన చెట్లను అర కిలోమీటరు మేర కాలినడకన వెళ్తూ పరిశీలించారు. సుమారు 200కిలో మీటర్ల వేగంతో సుడిగాలులు వీచి ఉంటాయని, దీంతో 300-400 చెట్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని కలెక్టర్‌కు డీఎఫ్‌వో వివరించారు.

అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. జరిగిన నష్టం గణన పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక పంపించి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. సుడిగాలి ప్రభావం కొన్నిచోట్ల తీవ్రంగానూ మరికొన్ని చోట్ల స్వల్పంగానూ ఉన్నట్లు గుర్తించామన్నారు. సుడిగాలులు ఏర్పడటానికి కారణాలను సైంటిస్టులతో అంచనా వేయిస్తామన్నారు. డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి ప్రాంతం నుంచి అటవీ ప్రాంతానికి వచ్చేసరికి సుడిగాలి తీవ్రత పెరిగిందని తెలిపారు. సుమారు 60మీటర్ల వెడల్పుతో సుడిగాలి వీచిందన్నారు. లెంకలగడ్డ నుంచి మహాముత్తారం రేంజ్ పరిధి వరకు పరిశీలించామని తెలిపారు. అడవిలో కొంత దూరం వరకు మాత్రమే దీని ప్రభావం ఉందన్నారు. ప్రస్తుతం ప్రాథమిక అంచనా మాత్రమే వేశామని పూర్తి నష్టం వివరాలను సర్వేచేశాక వెల్లడిస్తామని పేర్కొన్నారు.

అధికారుల తడబాటు

సుడిగాలి దాటికి దెబ్బతిన్న పంటల నష్టాన్ని వివరించడంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తడబడ్డారు. మంగళవారం సాయంత్రమే ఈ సంఘటన జరగ్గా గురువారం వరకు జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు అంచనా వేయలేకపోయారు. తనకున్న సమాచారం మేరకు కలెక్టర్ ఆరా తీసినా అధికారుల నుంచి సరైన సమాధానం లభించలేదు. చివరకు రైతులనే కలెక్టర్ నష్టం గురించి అడిగి తెలుసుకోవాల్సి వచ్చింది.. ఇంకొందరు అధికారులైతే ఘటన జరిగింది ఏ రోజో చెప్పలేకపోయారు. సంఘటన జరిగిన ప్రదేశం ఎక్కడ... ఎంత దూరం ఉందని తహసీల్దార్‌ను కలెక్టర్ అడగ్గా దిక్కులు చూడాల్సిన పరిస్థితి కనిపించింది. కలెక్టర్ రావడానికి ముందే అధికారుల హడావిడి కనిపించగా వ్యవసాయశాఖ ఏడీఏతో పాటు మరో అధికారి కలెక్టర్ వచ్చి పంటలు పరిశీలించడం అయ్యాక రావడం చర్చనీయాంశంగా మారింది.



సుడిగాలి దాటికి విరిగిపోయిన చెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అసలే అటవీ ప్రాంతం... పోలీసుల ఆలస్యం

అటవీ మండలమైన పలిమెలలో కలెక్టర్ పర్యటన దృష్ట్యా భద్రతను పర్యవేక్షించాల్సిన పోలీసులు ఆలస్యంగా రావడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ అడవి మార్గాన వెళ్లి పంటలను పరిశీలించి తిరుగుముఖం పట్టాక ఎస్సై సహా సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అధికారులు అవేమీ పట్టనట్లు ఆలస్యంగా రావడం విమర్శలకు తావిస్తోంది.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పలిమెల మండలం లెంకలగడ్డ శివారులో సుడిగాలులు సృషించిన బీభత్సం గురించి తెలుసుకున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఘటన స్థలిని వెంటనే పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మను ఆదేశించారు. పంటల వారీగా, రైతుల వారీగా జరిగిన నష్టం, ఎంత మేర అటవీ దెబ్బతిందో స్పష్టంగా ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ లెంకలగడ్డలో స్వయంగా పర్యటించి పరిశీలించినట్లు తెలుస్తోంది.

10న అథ్లెటిక్ పోటీలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అస్మిత లీగ్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా సంయుక్తంగా నిర్వహించనున్న ఈ పోటీలు దేశంలోని అన్ని మారుమూల జిల్లాల్లో జరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ పోటీలు భూపాలపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జరుగుతాయని తెలిపారు.

అండర్ 4, అండర్ 16 వయస్సు గల బాలికలకు మాత్రమే ఈ పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని సూచించారు. 60 మీటర్లు నుంచి 600 మీటర్ల వరకు, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో క్రీడలు ఉంటాయని వివరించారు.

ఆర్టీఎఫ్ఎంఎస్‌తో నాణ్యమైన విద్యుత్

- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్ నాయక్
- గంగారం సబ్‌స్టేషన్‌లో ఆటోమేషన్ ప్రక్రియ ప్రారంభం

6

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



యశ్వంత్ రవితేజ

లింగాలఘణపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీలకు జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నవాబుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు విజ్జగిరి యశ్వంత్, రవితేజ ఎంపికైనట్లు హెడ్మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. 5న హన్మకొండ జేఎన్ఎస్‌లో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చారన్నారు. ఎంపికైన విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ కాసర్ల ఇంద్రసేనారెడ్డిని ఎంఈవో పడాల విష్ణుమూర్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు సిద్దిలక్ష్మిలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకులం విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

ఏటూరునాగారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ములుగు జిల్లా ఏటూరునాగారం డిగ్రీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు మేఘన, కీర్తన ఎంపికయ్యారు. టీచర్ వెల్ఫేర్ సొసైటీ(ఆర్‌టీడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో జరగబోయే 58వ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ ఖోఖో పోటీలు ఇటీవల జవహర్‌లాల్ స్టేడియంలో జరగ్గా వీరు ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల, పీడీ డి.అరుణ తెలిపారు.

జాకారంలో జోనల్ క్రీడలు ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ములుగు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలంలోని జాకారం గురుకుల పాఠశాలలో 11వ జోనల్ క్రీడలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కుంజా సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి, డీఈవో సిద్ధార్థరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డీసీవో వెంకటేశ్వర్లు, భూపాలపల్లి డీసీవో భిక్షపతి, ములుగు ఎంపీడీవో సందీప్, పీడీలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, సురేష్ బాబు, పిచ్చిరెడ్డి, శ్రీను, సుధాకర్, పీఈటీలు చంద్రమౌళి, యాదగిరి,రామచంద్రం, రజనీ, బ్రహ్మచారి, సంపత్, ఆనంద్, మమత, పుల్లయ్య, దయానంద్, ముఖేష్, సదయ్య పాల్గొన్నారు. క్రీడల ప్రారంభానికి ముందు క్రీడాకారులకు డాక్టర్ రాములు వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

● మృతుడిది హైదరాబాద్‌లోని బండ్లగూడగా గుర్తింపు


శ్రీనివాస్ మృతదేహం

బచ్చన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని ఆలీంపూర్ - వీఎస్ఆర్‌నగర్ గ్రామాల మధ్య జనగామ-సిద్దిపేట ప్రధానరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ ఈసీఐఎల్ బండ్లగూడకు చెందిన బండి శ్రీనివాస్(40) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... బచ్చన్నపేట వైపు నుంచి చేర్యాల వైపునకు వెళ్తున్న డీసీఎం వాహనం, చేర్యాల వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తల పగిలిపోయింది. పలు శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హమీద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు పెయింటర్‌గా పనిచేస్తాడని తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

» హాజరు శాతం పెరిగేలా చూడాలి : కలెక్టర్


శివునిపల్లి డిగ్రీ కళాశాలలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శివునిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం పరిశీలించారు. పరిసరాలు, తరగతి గదులు, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి దోహదం

● జనగామరూరల్: పేద మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి పథకం ఎంతో దోహదం చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. స్త్రీ నిధి క్రెడిట్‌లో కోఆపరేటివ్ ఫెడరేషన్ పనితీరు, ఆర్థిక ప్రణాళికలు, రుణాల పంపిణీపై కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో కొత్త సభ్యులను చేర్చుకోవాలన్నారు. నిధులు దుర్వినియోగం చేసినట్లు సోషల్ ఆడిట్‌లో తేలితే నోటీసులు ఇచ్చి 15రోజుల్లోగా లోన్ రికవరీ చేయాలన్నారు. జిల్లాలో 50 వనితా టీ స్టాల్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో వసంత, స్త్రీనిధి డైరెక్టర్ భాగ్యలక్ష్మి, స్త్రీనిధి ఆర్ఎం నిర్మల పాల్గొన్నారు.

వానాకాలం వరి కోతలు షురూ..


మండలంలోని చింతకాని గ్రామం వద్ద ఆరబోసిన వడ్లు

కాటారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పోతులవాయి, చింతకాని, ఇబ్రహీంపల్లి తదితర గ్రామాల్లో వానాకాలం(ఖరీఫ్) వరికోతలు గురువారం ప్రారంభమయ్యాయి. నాట్లు వేయకుండా నేరుగా వడ్లు చల్లిన (బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్) పద్ధతిలో సాగుచేసిన రైతులు కోతలను మొదలెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు నాలుగు స్ట్రోక్ హార్వెస్టర్లు, చైన్‌తో కూడిన ట్రాక్ మెషిన్లతో వరి కోతలు చేపడుతున్నారు. మండలంలో ఈ సీజన్‌లో సుమారు 10వేల ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేయగా, వెయ్యి ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగైనట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లో మండల వ్యాప్తంగా బోర్ల కింద సాగు చేసిన వరి కోతలు ముమ్మరం కానసున్నాయి. ధాన్యం అమ్ముకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సింగరేణి గనిలో ఉద్యోగులకు కౌన్సెలింగ్

కృష్ణకాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని 5వ గనిలో ఉద్యోగులకు గైర్హాజరుపై గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కేటీకే గ్రూపు 1 ఏజెంట్ మాటూరి రవీందర్ ఆధ్వర్యంలో దీన్ని చేపట్టారు. గతంలో కనీస మస్టర్లు వంద మాత్రమే ఉండగా. ప్రస్తుతం వాటిని 190కి పెంచినట్లు తెలిపారు. తక్కువ మస్టర్లు ఉన్న వారిని విధుల నుంచి తొలగించాలని సంస్థ భావిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ మాచర్ల రమేష్, సంక్షేమ అధికారి ఎలిగేటి సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ స్కాన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ రాహుల్‌శర్మ


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సిటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోగులు సిటీస్కాన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) తమ సీఎస్ఆర్ నిధుల నుంచి ఆధునిక సిటీ స్కాన్ యంత్రాన్ని అందజేసింది. దానిని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవల్లో సిటీ స్కాన్ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రతీక్‌కుమార్ చక్రవర్తి, డిప్యూటీ మేనేజర్ వేణుబాబు, సునిల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఎఫ్ఎంఎస్‌తో నాణ్యమైన విద్యుత్

● ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్ నాయక్

● గంగారం సబ్‌స్టేషన్‌లో ఆటోమేషన్ ప్రక్రియ ప్రారంభం


సబ్‌స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మల్సూర్

కాటారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యుత్‌శాఖ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీఎఫ్ఎంఎస్)తో విద్యుత్ సమస్యలను క్షణాల్లో గుర్తించొచ్చని, తద్వారా నాణ్యమైన విద్యుత్‌ను అందించొచ్చని ఎన్‌పీడీసీఎల్ భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్ నాయక్ అన్నారు. దీంతోపాటు సబ్‌స్టేషన్ల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కాటారం మండలంలోని గంగారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటోమేషన్ సిస్టమ్‌ను గురువారం ఎంఆర్‌టీపీ, కన్‌స్ట్రక్షన్, ట్రాన్స్‌కో విభాగాల అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాటారం డివిజన్ పరిధిలోని పలు మండలాల ఏఈలు, విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆర్టీఎఫ్ఎంఎస్ ద్వారా వినియోగదారులకు అత్యంత నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా సమయాల్లో నెలకొంటున్న సమస్యలు, అడ్డంకులు, రియల్ టైమ్ డాటా తెలుసుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ ఫీడర్ల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందన్నారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చేయడంతో పాటు సరఫరాను తక్షణమే పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ పాపిరెడ్డి, ఎంఆర్‌టీపీ డీఈ సదానందం, ట్రాన్స్‌కో, ఎంఆర్‌టీపీ, కన్‌స్ట్రక్షన్ విభాగాల ఏడీఈలు నాగరాజు, ప్రశాంత్ రెడ్డి, సందీప్‌పాటిల్, సబ్ డివిజన్ పరిధి ఏఈలు ఉపేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, మంగీలాల్, శేఖర్, అనూష, సబ్ ఇంజనీర్స్ మహేష్, చందుహాసిని, ఎల్ఐ కిరణ్‌కాంత్, లైన్‌మెన్లు ప్రవీణ్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, జేఎల్ఎం రాజేందర్, విద్యుత్ సిబ్బంది, ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ గడ్డకు పూర్వవైభవం తెస్తా..

● స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ గడ్డకు పూర్వ వైభవం తీసుకువస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలోని రావిచెట్టు వద్ద గురువారం మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన 200 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీజేపీలో చేరగా.. పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించానని అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్ అంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నిద్రపట్టకుండా చేశామన్నారు. ఆయా ప్రభుత్వాలకు చెందిన పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఎన్నో రకాలుగా బెదిరింపులకు గురిచేసినా బెదరలేదని, రాష్ట్ర సాధన కోసం ఉడుంపట్టు పట్టి ఉద్యమాలు చేశామన్నారు. పెడింగ్‌లో ఉన్న దళితబంధు బిల్లులపై కరీంనగర్, హనుమకొండ జిల్లాల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి నియోజకవర్గంలోని దళితులకు బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులను, కార్యకర్తలను గెలిపించి పార్టీకి కానుకగా ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ సర్పంచ్ చకిలం శ్రీనివాస్, పంజాల సారయ్య గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు కట్కూరి అశోక్ రెడ్డి, బండి కళాధర్, కనుకుంట్ల అరవింద్, పల్లె వెంకట్ రెడ్డి, మౌటం సంపత్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలని సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీటకోడూర్, గానుగుపహాడ్ బ్రిడ్జిలను నిర్మించాలని బీజేపీ నాయకుడు శానబోయిన మహిపాల్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మహిపాల్ మాట్లాడుతూ గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంతో, చీటకోడూర్‌లో లోలెవల్ కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బొమ్మకంటి అనిల్‌గౌడ్, చింతకింది సంతోష్, మాలోత్ రాం కోటి, ఈర్ల నవీన్, మార్క ఉపేందర్, బి.తిరుపతి పాల్గొన్నారు.

● చీటకోడూర్ బ్రిడ్జి కూలిపోవడంతో సీపీఎం నాయకులు పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, మండల కార్యదర్శి బోడ నరేందర్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పోత్కనూరి ఉపేందర్, జోగు ప్రకాశ్, బాల్నె వెంకటమల్లయ్య, మీట్యానాయక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు

● డీఎంహెచ్‌వో గోపాలరావు

ఏటూరునాగారం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో) గోపాలరావు తెలిపారు. 'వైద్యం కోసం అర్ధరాత్రి వాగు దాటి..' శీర్షికన ఈ నెల 3న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కొండాయి గ్రామానికి చెందిన మాదారి రాజశేఖర్‌కు ఇద్దరు పిల్లలు కాగా, ఈనెల 2న ఉదయం ఆరేళ్ల పాప జ్వరం బారిన పడిందన్నారు. ఆరోజు అర్ధరాత్రి పాపకు జ్వర తీవ్రత ఎక్కువై వైద్యం కోసం వాగు దాటి వెళ్లారని అన్నారు. వైద్య సేవలనంతరం పాప ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. గ్రామంలోని పల్లె దవాఖానా ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామని, డాక్టర్ ప్రణీత్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య, ఆరోగ్య శాఖ కృషి చేస్తోందని, ప్రజలెవ్వరూ అధైర్యపడొద్దని ఆయన తెలిపారు.

చిట్యాల వాసికి జాతీయ అవార్డు


హైదరాబాద్‌లో అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకుంటున్న కిరణ్

చిట్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన గురుకుంట్ల కిరణ్ అంబేద్కర్ జాతీయ సేవా అవార్డు అందుకున్నారు. స్ఫూర్తి సర్వీస్‌సొసైటీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సిటీ కల్చర్ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న కిరణ్‌కు జాతీయ అవార్డు దక్కడంపై పలువురు ఆయన్ను అభినందించారు. తనకు అవార్డు ప్రదానం చేసినందుకు సంస్థ ప్రతినిధి డాక్టర్ ఆకుల రమేష్‌కు కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ బంగారం ముఠా?

కాటారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం అమ్మి ఓ కిరాణా షాపు యజమానిని బురిడీ కొట్టించిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాటారంలో చోటుచేసుకున్న నకిలీ బంగారం విక్రయం కలకలం రేపింది. ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్న ఓ ముఠా కిరాణా షాపు యజమాని వద్దకు వచ్చి అర కిలో నకిలీ బంగారాన్ని అంటగట్టి రూ. 10 లక్షలతో ఉడాయించిన విషయం విదితమే. ఈ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ నాగార్జునరావు నేతృత్వంలో పలువురు ఎస్సైలు తమ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గతంలో జరిగిన కేసుల పూర్వానుభవంతో ముఠా సభ్యులను మహారాష్ట్రలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన ముఠా సభ్యులను అన్ని కోణాల్లో విచారణ చేస్తే పలు రాష్ట్రాల్లో వారు చేసిన నేరాలు బయటపడే ఆవకాశం ఉంది. నకిలీ బంగారం కేసు విషయమై పోలీస్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు. ఒకట్రెండు రోజుల్లో ఈ కేసు చిక్కుముడి వీడనున్నట్లు తెలుస్తోంది.

ముగిసిన క్రీడా పాఠశాల ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆదేశాల మేరకు జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ప్రారంభం కానున్న క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాకు చెందిన బాలురకు జేఎన్ఎస్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 28మంది పాల్గొన్నారని డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14 లోపు జేఎన్ఎస్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రీడా పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ పూర్తి చేశామన్నారు. ఈ మేరకు 40 మంది బాలురు, 40 మంది బాలికలకు రెండురోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌లో 28మంది బాలురు, 27మంది బాలికలు మొత్తం 55 మంది ఈ ప్రక్రియలో పాల్గొన్నరన్నారు. జేఎన్ఎస్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం అర్హత సాధించిన బాలబాలికలకు డీఎస్ఏ నుంచి ఫోన్ ద్వారా త్వరలోనే సమాచారం అందిస్తామని అశోక్‌కుమార్ తెలిపారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి సాట్ అబ్జర్వర్లుగా ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ రవికుమార్, హాజరయ్యారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది, వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

● బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్



అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనదీక్ష చేస్తున్న బీసీ జేఏసీ నేతలు


వడ్డేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ నాయకులు మౌనదీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో 10శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని అన్ని రంగాలను శాసి స్తూ బీసీ సమాజాన్ని అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలు మాత్రం అగ్రవర్ణ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగా, ఓట్లు వేసే యంత్రాలుగా మిగిలిపోతున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే మద్దతునిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయన్నారు.

ఈ మౌనదీక్షలో వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాడి మల్లయ్య యాదవ్, బొనగాని యాదగిరి గౌడ్, బీసీ జేఏసీ మహిళా నాయకురాళ్లు తమ్మల శోభారాణి, మాదం పద్మజాదేవి, తేళ్ల సుగుణకిశోర్, హైమావతి, బచ్చు ఆనందం, దాడి రమేష్ యాదవ్, గొట్టె మహేందర్, డాక్టర్ ఒడితెల రాము, తంగళ్లపెల్లి రమేష్, పంజాల మధుగౌడ్, జ్ఞానేశ్వర్, రజినీకాంత్, పొన్నం సంపత్, చాగంటి రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికత

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- తొలిసారిగా 16 సర్కిళ్లలో ఏర్పాటు
- లోపాల సవరణకు ఎఫ్‌పీఐలు
- ఆటోమేటిక్ మీటర్ రీడింగ్
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వెల్లడి


సబ్‌స్టేషన్‌లో అమర్చిన ఆధునిక పరికరాలు

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి సాంకేతికంగా అందిపుచ్చుకొని రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీఎఫ్ఎం)ను ఎన్‌పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో ఏర్పాటు చేశామని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. దేశంలోని అధునాతన టెక్నాలజీ అయిన ఆర్‌టీఎఫ్ఎంను ఎన్‌పీడీసీఎల్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో రియల్ టైమ్‌లో కచ్చితమైన సమాచారం పొందగలుగుతామని, తద్వారా వేగవంతంగా చర్యలు చేపట్టవచ్చునని అన్నారు. ఫీడర్ల పర్య వేక్షణ, త్వరగా ప్రతిస్పందించడం ద్వారా అంతరాయాలు గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. టెక్నికల్ టీమ్ సభ్యులు ఆరు రాష్ట్రాలలో ఈ సాంకేతిక తను అధ్యయనం చేసిన తర్వాత ఎంచుకున్నామని చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో ఈ టెక్నాలజీ వాడుతున్నా రని తెలిపారు. ఎన్‌పీడీసీ ఎల్‌కు అనుగుణంగా ఈ టెక్నాలజీ సరిపడేలా తీర్చిది ద్దామని చెప్పారు. ఈ అధునా తన టెక్నాలజీ ఎన్‌పీడీసీఎల్‌కు ఉపయోగకరంగా ఉందని నిర్ధారించు కున్న తర్వాతనే, ముందుగా ఐదు సబ్‌స్టేషన్లలో ప్రయోగాత్మకంగా పరీక్షించామన్నారు. ఈ 5 సబ్‌స్టేషన్లు స్కాడా కు అనుసంధానం అయిన తర్వాత వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మిగతా 133 సబ్‌స్టేషన్లకు అనుసంధానించామని వివరించారు. మిగిలిన సబ్‌స్టేషన్ల పనులు చురుకుగా సాగుతున్నాయని, లక్ష్యాలను సాధించే దిశగా ఇంజనీర్లు శక్తివంచన లేకుండా కృషి చేస్తు న్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని సబ్‌స్టేషన్లకు అవసరా నికి తగ్గట్టుగా తక్కువ ఖర్చుతో ప్రభావంతంగా నిరూపితమైన సమాచార సాంకేతికత రూపొందించామని చెప్పారు. వరంగల్ హెడ్‌క్వార్టర్స్‌లో స్కాడాకు సబ్‌స్టేషన్ల కొరకు కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశామని వరుణ్‌రెడ్డి తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లను దృష్టిలో ఉంచుకొని రాబోయే 15 ఏళ్లకు సంబంధించి సాఫ్ట్‌వేర్ పరంగా సర్వర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఎఫ్‌పీఐ ప్రయోజనాలు

ఎఫ్‌పీఐ విద్యుత్ సమస్యను, సమాచారాన్ని, స్థానాన్ని వేగంగా గుర్తించి కంట్రోల్ సెంటర్‌కు తెలియజేస్తుంది. సంబంధిత ఫీల్డ్ సిబ్బందికి ఎస్ఎంఎస్ హెచ్చరికలు వెళతాయి. అదే విధంగా ఎఫ్‌పీఐ ద్వారా ప్రదేశంలో ఫ్లాష్‌లైట్ సూచన కూడా కనిపిస్తుంది. ఫీల్డ్ సిబ్బంది మొత్తం లైన్‌లో పెట్రోలింగ్ చేయకుండా నేరుగా సమస్య ఉన్న భాగాన్ని గుర్తించగలుగుతారు. దీనివల్ల ఫాల్ట్ డిటెక్షన్, పునరుద్ధరణ సమయం ఆదా అవుతుంది.

ఆర్‌టీఎఫ్ఎంతో ప్రయోజనాలు

ఈ సాంకేతికత వల్ల స్కాడా కంట్రోల్ రూమ్ నుంచి నిర్వహించవచ్చు. రియల్ టైంలో విద్యుత్ అంతరాయం సమాచారాన్ని ఫీల్డ్ సిబ్బందికి తెలియజేసి అతిత క్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చు. ఓవర్‌లోడ్ హెచ్చరికలను ఫీల్డ్ సిబ్బందికి రియల్ టైమ్‌లో తెలియజేయవచ్చు. విద్యుత్ వినియోగం, వోల్టేజీ లెవల్స్ మొదలైన వివరాలను రియల్ టైమ్‌లో సేకరించవచ్చు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని వేగవంతంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టం ఎంతో ప్రయోజనకరమని సీఎండీ తెలిపారు.

ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ)

దీనికి అనుసంధాంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33 కేవీ, 11 కేవీ సుదూర లైన్లలో ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లను పెడుతున్నామ ని చెప్పారు. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రకృతి వైపరిత్యాలు లేదా సాంకేతిక కారణాల వల్ల లైన్ మొత్తం తనఖీ చేసే అవసరం లేకుండా, విద్యుత్ అంతరాయం ఏర్పడిన భాగాన్ని ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ గుర్తిస్తుంది. తద్వారా అంతరాయం ఏ భాగంలో జరి గిందో వెంటనే విశ్లేషించి, అక్కడికే వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. ఫాల్ట్‌ను త్వరగా పున రుద్ధరించడంలలో ఎఫ్‌పీఐఎస్ ఎంతో దోహదపడుతున్నాయని వివరించారు. 33,11 కేవీ ఫీడర్లలో 2500 ప్రదేశాల్లో ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు.

ఆటోమేటిక్ మీటర్ రీడింగ్

హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులకు బిల్లుల అందజేతలో వేగం, పారదర్శకత పెంచేందుకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఎఎంఆర్) వ్యవస్థను రూపొందించామని తెలిపారు. విద్యుత్ వినియోగదారు లకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఎఎంఆర్ విధానం ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సర్కిల్‌లో అధిక సామర్థ్యంతో విద్యుత్ వినియోగించే పరిశ్రలకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ విధానం వల్ల తప్పులు జరిగే అవకాశం ఉండదని, విద్యుత్ సరఫరాలో వచ్చే హెచ్చు తగ్గులను త్వరితగతిన గుర్తించవచ్చునని తెలిపారు. సిబ్బంది సమయం వృథా కాదని సీఎండీ పేర్కొన్నారు.


ఎన్‌పీడీసీఎల్ ఏర్పాటు చేసిన సరికొత్త సాంకేతిక యంత్రాలు



డీన్ కార్యాలయం వద్ద బైఠాయించిన పీహెచ్‌డీ ఆశావహ అభ్యర్థులు

పీహెచ్‌డీ ప్రవేశాల్లో గందరగోళం

- సీట్లు పెంచాలని అభ్యర్థుల ఆందోళన
- డీన్ ఆఫీస్ ఎదుట బైఠాయింపు
- కేయూ వీసీ, రిజిస్ట్రార్లను కలిసి వినతి

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పీహెచ్‌డీ అడ్మిషన్ల రీషెడ్యూల్ ఇంటర్వ్యూ ప్రక్రియ గందరగోళంగా మారింది. గురువారం ఉదయం కేయూక్యాంపస్‌లోని డీన్ కార్యాలయం ఎదుట పీహెచ్‌డీ అభ్యర్థులకు రీ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సమాయత్తం అయ్యారు. ఈ క్రమంలో అభ్యర్థులందరూ ఇంటర్వ్యూల ప్రక్రియను అడ్డుకున్నారు. గతంలో నిర్వహించిన తెలుగు పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూలు ఎందుకు రద్దు చేసి రీషెడ్యూల్ ప్రకటించారని అభ్యర్థులు వర్సిటీ ఉన్నతాధికారులను నిలదీశారు. డీన్ కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. తెలుగు విభాగంలో ఆశావహులైన పీహెచ్‌డీ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారని, సీట్లు రెండు ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలతో అభ్యర్థుల గొడవ నేపథ్యంలో పోలీసులు డీన్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అభ్యర్థులను శాంతించేందుకు ప్రయత్నించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సీట్ల పెంపు అంశం తన పరిధిలో లేదని, వీసీ దృష్టికి తీసుకుపోతామని ఆర్ట్స్ విభాగం ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ప్రకటించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వర్సిటీ పరిపాలన భవనానికి చేరుకుని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి తమ డిమాండ్లను విన్నవించారు. వీసీ, రిజిస్ట్రార్‌కు తెలుగు విభాగంలో సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సీట్ల పెంపు ఇప్పటికప్పుడు సాధ్యం కాదని, డీన్ కార్యాలయంలో అర్హులైన అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని, మళ్లీ నోటిఫికేషన్‌లో వారికి సీట్ల కేటాయించేలా ప్రయత్నిస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తమకు ఇప్పటి నోటిఫికేషన్‌లోనే సీట్లను పెంచి ఇంటర్వ్యూలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు నోటిఫికేషన్ ఇచ్చిన సీట్ల సంఖ్య పెంచడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. 2022 పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో అన్ని విభాగాల్లో సీట్లు పెంచి ఆశావహులైన అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించగా, తెలుగు విభాగంలో కొద్దిమందికే అవకాశం కల్పించారని అభ్యర్థులు అధికారులకు విన్నవించారు.

ఇదిలాఉండగా, తెలుగు విభాగంలో నిర్వహించిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలలో అవకతవకలు జరిగాయని వర్సిటీ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఈ దఫా పకడ్బందీగా పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని భావించిన కేయూ ఉన్నతాధికారులు తిరుపతిలోని పద్మావతి మహిళ వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌తోపాటు నాగార్జున వర్సిటీ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్లను ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టులతో కమిటీని నిర్వహించారు. కాగా కేయూ తెలుగు విభాగం విభాగం రిటైర్డు ప్రొఫెసర్ ఇంటర్నల్ సబ్జెక్టు ఎక్స్‌పర్టుగా ఉండి అవకతవకలకు పాల్పడిన అంశాలపై వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఆందోళనలో తెలుగు పీహెచ్‌డీ ఆశావహులైన అభ్యర్థులు రాజు, యాదగిరి, సునీల్, శైలజ, తిరుపతితో పాటు దివ్యాంగులు పాల్గొన్నారు.

గురుకుల జోనల్ పోటీలు అదుర్స్!

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : మల్టీ జోనల్ అధికారి అలివేలు


క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి మల్టీ జోనల్ క్రీడా పోటీలు అదుర్స్ అనిపించాయి. గురువారం మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఈ పోటీలను సాంఘిక సంక్షేమ గురుకుల జోనల్ స్థాయి అధికారులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భద్రాద్రి జోన్ పరిధిలోని 11 గురుకులాల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్, హై, లాంగ్ జంప్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అతిథులకు వివిధ గురుకులాల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. మల్టీ జోనల్ అధికారి అలివేలు క్రీడా జ్యోతిని విద్యార్థులకు అందించి పోటీలను ప్రారంభించారు. డ్యాన్స్‌తో విద్యార్థులు హోరెత్తించారు. తొలి రోజు నుంచే పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో డీసీవో జాక్వెలిన్, క్రీడల అధికారి రూత్మనీ, డీఎంహెచ్‌వో రవిరాథోడ్, డీపీఏహెచ్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ విజయానంద్, ఎస్సై వీరభద్రరావు, డాక్టర్ రవినాయక్, ప్రిన్సిపాల్ దయాకర్, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకొని ఉన్నత శిఖిరాలకు చేరుకోవాలని భద్రాద్రి మల్టీజోన్ అధికారి అలివేలు ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మరిపెడ ఎస్సీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 11వ జోనల్ పోటీల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములను సహజంగా తీసుకొని మెళకువలను నేర్చుకోవాలని కోరారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. పోటీలకు హాజరైన విద్యార్థులను అభినందిస్తూ మల్టీజోన్ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎదగాలన్నారు.

ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీ రిజర్వేషన్ల అమలు

- 9వ షెడ్యూల్‌లో బిల్లును చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బీసీ దీక్షలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్


నర్సంపేటలో బీసీ దీక్ష వద్ద మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య ఆధ్వర్యంలో నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఒక రోజు బీసీ దీక్షను నిర్వహించారు. దీక్షను ప్రారంభించిన అనంతరం అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించినంత మాత్రాన 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పుడే బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యమవుతుందన్నారు. రిజర్వేషన్ల అమలుకోసం కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తే 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

వడ్డెర సంఘం నాయకుడు ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, బీసీ నాయకుడు గుంటి రాంచందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య మాట్లాడుతూ.. బీసీలను ఓటు బ్యాంక్‌గానే వినియోగించుకుంటున్నారే తప్ప జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాలలో న్యాయం చేయడం లేదన్నారు. జెండాలు పక్కకు పెట్టి 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం ఉద్యమాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపి 7నెలలు గడిచిపోతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని ఆయన అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను గ్రామాల్లో తిరగ కుండా చేస్తే దిగివచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును చేరుస్తుందని ఆయన అన్నారు. ఇంటలెక్చువల్స్ ఫోరం చీఫ్ కో-ఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ పేరులో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా బీజేపీ నాయకులు బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నీలారపు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, జిల్లా కో-ఆర్డినేటర్ సాంబరాతి మల్లేశం, సోమ రాంమూర్తి, గండు రవి, వివిధ సంఘాల నాయకులు పంజాల వెంకట్, పులిగిల్ల యాదగిరి, డాక్టర్ జగదీశ్వర్, ఆబోతురాజు యాదవ్, సోల్తి మధు. సోల్తి సాయికుమార్, భిక్షపతి, బూస అశోక్, శివరాత్రి స్వామి, మనోహర్, గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి చంద్రమౌళి. మద్దెల శ్రీనివాస్, సీపీఐ నాయకులు పంజాల రమేశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. దీక్ష చేపట్టిన బీసీ నాయకులకు డాక్టర్ వీఎం.జయుడు, మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, రామ్మూర్తి, జాటోత్ బాలునాయక్, నిమ్మరసం అందించి దీక్షను విరమింప జేశారు.

నగరంలో మెరిసిన శ్రీలీల

(5వ పేజీ తరువాయి)

చూడాలనుకుంటున్నాను...' అని హుషారుగా మాట్లాడారు. కొత్తదనం కోరుకునే షాపింగ్ ప్రియులకు సరికొత్త షాపింగ్ ప్రపంచం ఆర్.ఎస్. బ్రదర్స్ అని తెలిపారు. సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దక్షిణ భారతంలో విస్తరణలో భాగంగా వరంగల్ మహానగరంలో సరికొత్త షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుటుంబంలోని అన్ని తరాలవారి అభిరుచులకు అనుగుణంగా వైవిధ్యభరితమైన, నాణ్యమైన ఆకర్షణీయమైన ఉమెన్స్, కిడ్స్, మెన్స్ వేర్ వస్త్రాలు అందుబాటు ధరలతో లభ్యమవుతాయని తెలిపారు.

కాగా, శ్రీలీల రాకతో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్‌మాల్‌ప్రాంతం సందడిగా మారింది. తాను నటించిన వివిధ సినిమాల ట్రెండింగ్ పాటలు డీజేలతో హోరెత్తుతుండగా... అభిమానులను అలరిస్తూ మాట్లాడారు. అభిమాని ఒకరు తాను చిత్రించిన శ్రీలీల ఫొటోను చూపగా, ఆమె వెంటనే అతడిని స్టేజిపైకి పిలిచి ఆ చిత్రాన్ని అందరికీ చూపుతూ అభినందించారు. అభిమానులు స్టెప్స్ వేయాలని కోరగా.. 'మీరు వేస్తే నేను చూస్తాను..' అని ఆమె చెప్పడంతో అభిమానులు హుషారుగా స్టెప్స్ వేశారు. ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను స్టేషన్‌రోడ్డులోని పాత సునీల్ థియేటర్ స్థలంలో ఏర్పాటు చేశారు.

కార్మిక శాఖలో దళారుల మాయాజాలం

- కార్మికురాలు బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్
- వెలుగు చూస్తున్న విచిత్ర ఘటనలు
- నిధుల కాజేతకు యత్నం


విచారణ కోసం కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చిన కార్మిక నాయకులు

బాలసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ నిధులు కాజేసేందుకు కొందరు దళారులు అధికారులను బురిడి కొట్టించేందుకు యత్నించిన ఘటన వెలుగు చూసింది. లేబర్ కార్డు కలిగి ఉన్న ఒక కార్మికురాలు బతికుండగానే ప్రమాదవశాత్తు చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఈ-సేవలో క్లెయిమ్ రిజిస్ట్రేషన్ అప్‌లోడ్ చేశారు. సుమారు ఆరు నెలల క్రితం లేబర్ కార్డు కలిగి ఉన్న వరంగల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రాసమల్ల రజితకు ప్రమాదవశాత్తు కాలికి గాయం కావడంతో సంక్షేమ నిధి నుంచి డబ్బుల కోసం కార్డు పట్టుకొని హనుమకొండలోని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. కార్డు నంబర్‌తో రికార్డులను పరిశీలించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సదరు కార్మికురాలు రజిత మృతి చెందినట్లుగా క్లెయిమ్ కోసం డెత్ సర్టిఫికెట్ సమర్పించినట్లు కంప్యూటర్‌లో చూసి విస్తుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్మికురాలికి సలహా ఇచ్చారు. అంత రాద్ధాంతం ఎందుకని కార్మికురాలి కుటుంబ సభ్యులు మిన్నకున్నారు.

గత మంగళవారం వరంగల్ జిల్లా కొత్తపేటకు చెందిన రాసమల్ల రజిత బతికుండగానే మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ. 6 లక్షల 30 వేల నిధులు దళారులు దండుకున్నారని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. బుధవారం సెలవురోజు కావడంతో గురువారం కార్మికురాలి కుటుంబ సభ్యులు కార్మిక శాఖ కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. తాము అక్రమంగా నిధులు కాజేసినట్లు తమ కుటుంబాన్ని గ్రామస్థులు అనుమానిస్తున్నారని వాపోయారు. ఇంతలో అక్కడికి చేరుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్, ఇతర కార్మిక నాయకులు మహ్మద్ గౌస్, అజీమొద్దీన్, భిక్షపతి ఆరా తీశారు. అందుకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రజిత సమాధానమిస్తూ ఎవరో క్లెయిమ్ కోసం అప్‌లోడ్ చేశారని అందుకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించలేదని వివరించారు. ఈ విషయంపై తమ అధికారి, సంక్షేమ బోర్డు, బాధితురాలికి లెటర్ పెట్టినట్లు తెలిపారు.

- ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు రాజేందర్ మాట్లాడుతూ.. కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారని కార్మికులు కానివారికి లేబర్ కార్డులను ఇప్పిస్తున్నారని అసలైన కార్మికులు దరఖాస్తులను సమర్పించేందుకు వస్తే కొందరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు అనేక కొర్రీలను పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కార్మిక శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

లైంగిక దాడుల నివారణకు అప్రమత్తత అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



సమావేశంలో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు అవగాహన, అప్రమత్తత అవసరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో గురువారం ఆన్‌లైన్‌లో చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్, చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లైంగిక వేధింపులపై సమాజానికి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బాలల హక్కులు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని, నేటి విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు అలవాటు పడి ఆన్‌లైన్ గేమ్స్, ఇతర ఆప్షన్లు డౌన్‌లోడ్ చేసుకుని అనేక సమస్యల్లో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి కె.జయంతి, పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎస్.భాస్కర్, శ్యాంసుందర్, సునిత, విశ్వజ, స్వరూప, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేయూ క్యాంపస్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని మొదటి అంతస్థుతో పాటు పరీక్షల విభాగంలో స్టోర్‌రూమ్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌కట్ల రాజేందర్‌లు పాల్గొంటారని కేయూ డీపీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ దివాకర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

వెంకటాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని తేమశాతం లేకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లయ్ డీఎం బి.రాంపతి, తహసీల్దార్ గిరిబాబు, ఏపీఎం ధర్మేందర్, సీసీ ఐలయ్య, ఏఈవో దయాన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే భావి సమాజ నిర్మాతలు

మహదేవపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులే భావి సమాజ నిర్మాతలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవి పర్యవేక్షణలో వలంటీర్లతో కళాశాల ఆవరణలో గురువారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ మౌనదీక్ష

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిరసన



మౌనదీక్షలో బీసీ జేఏసీ నాయకులు

ములుగు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీల 42 శాతం కామన్ డిక్లరేషన్ అమలు చేయాలని అన్నారు. లేదంటే రాష్ట్రంలోని ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం అవసరమైతే తెలంగాణ ఉద్యమంలా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్ అమలుకు పార్టీలకు అతీతంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్, సామాజిక న్యాయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఏషబోయిన సాంబయ్య యాదవ్, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన భిక్షపతి గౌడ్, బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు రామంచి రామ ప్రతాప్, జేఏసీ జిల్లా నాయకులు గోల్కొండ రాజు, గంద్రకోట జాంబయ్య, ప్రజా సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్ వర్మ, నాయకులు యాదగిరి గౌడ్, కాకి రవిపాల్, కాకి అశోక్, భూక్య దేవా నాయక్, శ్యామల్ నాయక్, మేరుగు రాజు యాదవ్, రజనీకాంత్, చంద్రగిరి, ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు.. తప్పిన ప్రమాదం

ఏటూరునాగారం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఓ పెంకుటిల్లు కూలిపోయిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన బక్కమ్మ మట్టి గోడలతో కూడిన పెంకటిట్లు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి గోడలు బాగా తడిచిపోయాయి. బక్కమ్మ ఆరుబయట పని చేసుకుంటుండగా ఒక్కసారిగా పెంకుటిట్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా హఠాత్తుగా ఇల్లు కూలిపోవడంతో ఇంట్లోని బీరువా, సామాన్లు, నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అక్షరజ్యోతులు వెలిగించాలి



శిక్షణ కార్యక్రమంలో అధికారులు

వాజేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా మహిళల్లో అక్షరజ్యోతులు వెలిగించాలని ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్, టాస్ జిల్లా సమన్వయకర్త వీర్ల కృష్ణబాబు అన్నారు. మండల కేంద్రంలో విద్యాశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో గురువారం ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన మహిళా సంఘాలు, రిసోర్స్‌పర్సన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణబాబు హాజరయ్యారు. అనివార్య కారణాల వల్ల చదువుకు దూరమైన వయోజనులు, మహిళలను చదువువైపు ప్రోత్సహించి తద్వారా అక్షరాస్యులు చేయాలన్నదే లక్ష్యమన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మండలంలో లెర్నర్స్ 1449, వలంటీర్లు 177 మందిని గుర్తించి విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సతీష్, సీఆర్పీలు రాజేశ్వరి, సునీత, సీసీలు మల్లీశ్వరి, వెంకటలక్ష్మి, సత్యనారాయణ, సిబ్బంది భవాని తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ పంపిణీ

వెంకటాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిర, ఆలుబాక గ్రామాల్లో కాఫెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో 150మంది గర్భిణులు, బాలింతలకు సమకూర్చిన ప్రొటీన్ పౌడర్, పండ్లను వైద్యాధికారి భాస్కర్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పండ్లు, పాలు, ఆకుకూరల వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లూర్థురాజు, సిబ్బంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, భాస్కర్, స్వరూప, ఇందిర, ఉష, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

వెంకటాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం రైతువేదికలో గురువారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఉద్యాన శాఖ అధికారి కోపిరి లావణ్య రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానం, ఫర్టిలైజర్, యాజమాన్య పద్ధతులు, చీడపీడలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి తప్పనిసరిగా రెండెకరాల ఆయిల్‌పామ్ పంట సాగు చేయించేలా కృషి చేయాలన్నారు. దానికి సంబంధించిన రైతులు భూమిపట్టా, వన్‌బీ, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్కు, డాక్యుమెంటేషన్, ఫొటోలను ఆయిల్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌కు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్, ఏఈవోలు శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాటారం నాయకులు



మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రచారానికి వెళ్తున్న నాయకులు

కాటారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాటారం డివిజన్ నాయకులు సైతం పాల్గొంటున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీనగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు నాయకులు నాయిని శ్రీనివాస్, ఐత రాజిరెడ్డి, బీరెల్లి రజనీకుమార్, పున్నం రమేష్, నరేష్ తదితరులు గురువారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

ట్రైనీ ఐఏఎస్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



ట్రైనీ ఐఏఎస్‌ల బస చేయనున్న లపాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

మహదేవపూర్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పలిమెల మండలం లెంకలగడ్డలో ట్రైనీ ఐఏఎస్ అధికారుల బసకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. ఈనెల 8 నుంచి 15 వరకు జిల్లాలో పర్యటించనున్న ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం కోసం లెంకలగడ్డ ప్రాథమిక పాఠశాలలో బసచేయనున్న నేపథ్యంలో కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ అధికారుల బస కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మౌళికవసతులు కల్పించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో సాయిపవన్, ఎంఈవో ప్రకాశ్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు

కృష్ణకాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ మెయిన్‌రోడ్డు ప్రాంతానికి చెందిన తాటిపల్లి రాజబాబు తన భూమిలో ఇటీవల నిర్మించిన భవనాన్ని ఆస్పత్రికి అద్దెకు ఇవ్వడాన్ని ఒప్పందం చేసుకున్నాడు. ఆ సమయంలో పట్టణానికి చెందిన ఎస్‌పీకే సాగర్ అనే వ్యక్తి ఆ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ బెదిరింపులకు గురి రూ. 2లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు రూ. 2 లక్షలు ఇచ్చినా మళ్లీ బెదిరిస్తూ రూ.4 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దీంతో బాధితడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

నేలవాలిన వరితో తంటాలు



దేవరాంపల్లిలో నేలవాలిన వరిని కుచ్చెలుగా కడుతున్న రైతులు

కాటారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోతలకు వస్తున్న దశలో కురిసిన అకాల వర్షాలతో నేలవాలిన వరిని కాపాడుకోవడానికి రైతులు తంటాలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపు నీళ్లు పూర్తిగా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వరిని పైకి నిలబెట్టి వడ్ల నాణ్యత దెబ్బతినకుండా చర్యలు చేపడుతున్నారు. కొందరు రైతులు వరిని మొదళ్ల సహా నిలబెట్టి నాలుగైదు కుదుళ్లను కలిపి కుచ్చెలుగా కడుతుండగా, మరికొందరు వర్షపు నీటిని తీసేసి అలాగే ఆరబెట్టి కోతలకు సిద్ధమవుతున్నారు. మండలంలో 11వేలకు పైగా ఎకరాల్లో వరి సాగుచేయగా అందులో 10వేలకు పైగా ఎకరాల్లో సన్న రకాల వరి సాగు చేయడం విశేషం. చాలా వెరైటీలు 145రోజులకు కోతకు వచ్చేవి ఉండటంతో వర్షాల ప్రభావం అధికంగా ఉందని రైతులు తెలిపారు.

'నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్'పై సమీక్ష



సమీక్ష సమావేశంలో అధికారులు

కన్నాయిగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతనపల్లిలో అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు గురువారం పర్యటించారు. డిప్యూటీ సెక్రటరీ, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెడిమీస్ అన్వేష్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై ఆరా తీశారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాకు ద్వారా చేపట్టిన పనుల పురోగతి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని సౌకర్యాల గురించి మెడికల్ ఆఫీసర్ అభినవ్‌ను అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ ప్రోగ్రాంకు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లోనూ వంద శాతం 100 శాతం ప్రగతి సాధించాలని అన్నారు. అనంతరం రాజన్నపేట సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్ లక్ష్యాలను సాధించటానికి ఎదుర్కొంటున్న సమస్యలను ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.డి.సర్వర్, ఎంపీడీవో అనిత, మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, నీతి ఆయోగ్ బ్లాకు కోఆర్డినేటర్ రవీష్, ఎంపీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు,

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అభయ మిత్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎవరైనా అపరిచితుల నుంచి కాని, బ్యాంకు అధికారుల నుంచి కాని ఓటీపీ చెప్పాలని ఫోన్లు వస్తే ఓటీపీ చెప్పొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్సై సాయికృష్ణ, పోలీస్ సిబ్బంది, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మంగపేట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కమలాపురం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రా నికి చెందిన ఇప్పాల నరేష్- శివరంజని దంపతులు అన్నదా నం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కమలాపురం గ్రామ ప్రజలతోపాటు మంగపేట, బోరునర్సాపురం గ్రామాల నుంచి భక్తులు అధిక పాల్గొన్నారు.

ట్రైబల్ మీట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహదేవపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 3, 4వ తేదీల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన ట్రైబల్ మీట్‌లో మహదేవపూర్ పాఠశాలలో చదువుతున్న బాలురు సత్తా చాటారు. ఖోఖో సీనియర్, జూనియర్ విభాగంలో పి.సుమన్ ప్రథమ స్థానం, సీనియర్ విభాగంలో వినయ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని ఉపాధ్యా యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా.ధ్యాయుడు ఆర్.అనిల్‌కుమార్, పీడీ సిరంగి రమేష్,ఉపాధ్యాయులు బి.రాజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజయ్య, దేవేందర్‌రెడ్డి, లచ్చయ్య, అనిల్‌కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశీనాథం సేవలు చిరస్మరణీయం : సమ్మారావు

రూ 59 వేల ఆర్థిక సాయం అందించిన పూర్వ విద్యార్థులు

మంగపేట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుడిగా ఏజెన్సీ ప్రాంతంలో కాశీనాథం చేసిన సేవలు చిరస్మరణీయమని ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకుడు గొప్ప సమ్మారావు కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కాశీనాథం ఇటీవల మరణించగా మండలంలోని తిమ్మంపేటలో గురువారం పూర్వ విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంస్మరణ సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా సమ్మారావు మాట్లాడుతూ 1970-80లో ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన కాశీనాథం ఎందరో జీవితాల్లో వెలుగు నింపారని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయ కులు సేకరించిన రూ.59 వేలను కాశీనాథం కుటుంబ సభ్యులకు అందజేశారు.

'చివరి'కి ఇలా..

మనిషికి చివరి మజిలీ శ్మశానం. అంత్యక్రియల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వం శ్మశాన వాటికలను నిర్మించింది. అయితే.. మండల కేంద్రంలోని శ్మశానవాటికను మాత్రం అధికారులు విస్మరించారనే విమర్శలు వస్తున్నాయి.

వెంకటయ్య అనే వృద్ధుడి అంత్యక్రియలు గురువారం జరగ్గా ఈ సందర్భంగా ఆయన బంధువులు ఇబ్బందులు పడ్డారు మృతదేహాన్ని తరలిస్తుండగా ప్రవేశ ద్వారం వద్ద కైలాస రథం బురదలో దిగబడింది. దీంతో మృతుడి బంధువులే కైలాస రథాన్ని నెట్టుకుంటూ బయటకుతీశారు. అంత్యక్రియల అనంతరం బంధుమిత్రులు నీట మునగడానికి నీళ్ల కూడా లేవు. పంచాయతీ సిబ్బందిని సంప్రదించగా బోర్ మోటారు పాడైపోయిందని తెలిపారు. దీంతో చేసేదేమీ లేక చేతి పంపు కింద ఒక్కొక్కరు స్నానాలు చేశారు. మండల కేంద్రంలోనే ఇన్ని సమస్యలు ఉంటే పంచాయితీ కార్యదర్శి, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- రేగొండ (ఆంధ్రజ్యోతి)



బంగారం చోరీ

మహబూబాబాద్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని బస్టాండ్‌లో బంగారం అపహరణకు గురైంది. బస్సు ఎక్కుతున్న మహిళా హ్యాండ్ బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 10 తులాల ఆభరణాలను తస్కరించారు. ఈ ఘటన మహబూబాబాద్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రజీనా వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు అశ్వరావుపేట నుంచి నర్సంపేటకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. మహబూబాబాద్ బస్టాండ్‌లో దిగి టిఫిన్ చేసిన అనంతరం బస్సులో బుధరావుపేటకు బయలు దేరారు. మహబూబాబాద్ పట్టణం దాటుతున్న క్రమంలో కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించేందుకు హ్యాండ్ బ్యాగ్ ఓపెన్ చేయగా 10 తులాల ఆభరణాల బాక్స్ లేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

మృతురాలి కుటుంబానికి సూర్య పరామర్శ



నాగమణి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సూర్య

గోవిందరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క వ్యక్తిగత సహాయకుడు ఈక వెంకటస్వామి తమ్ముడి భార్య నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన నాగమణి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటావని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసూత్ సీతారాంనాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, నాయకులు ఈక అప్పయ్య, చింత క్రాంతి, గుండెబోయిన నాగలక్ష్మి, అనిల్, గొంది కిరణ్, జగ్గారావు, రాజు, సారయ్య, నేపాల్‌రావు, బలరాం, శ్రావణ్, సమ్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్థుల వినతి

గోవిందరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుడు చిలుక వెంకన్న ఆత్మహత్యాయత్నానికి కారణమైన గోవిందరావుపేట పంచాయతీ కార్యదర్శి డేగల శంకర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంకన్న మూడేళ్ల నుంచి నిజాయితీతో విధులు నిర్వర్తిస్తున్నాడని, గత రెండేళ్లుగా పంచాయతీ కార్యదర్శి శంకర్ నిరంతరం ఆయనను దుర్భాషలాడుతూ, అవమానపరుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. పంచాయతీ కార్యదర్శి వేధింపులను భరించలేకనే వెంకన్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, వరంగల్ ఎంజీఎంలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు కారణమైన శంకర్‌పై విచారణ చేపట్టి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వెంకన్నకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించి రక్షణ కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి

మంగపేట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మ్యూచువల్ బదిలీలో ములుగు జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ మ్యూచువల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల షార్ట్ ఏజ్, సర్ ప్లస్ జాబితాను విడుదల చేసిందని, దాని ప్రకారం పాఠశాలల్లో మరోమారు వర్క్ అడ్జస్ట్ మెంట్ చేయనుందని తెలిపారు. ప్రమోషన్ సీనియరిరిటీ ఆధారంగా జూనియర్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపుతున్నారని, దీని వల్ల జీవో 402 ప్రకారం పరస్పర బదిలీల ద్వారా పునఃకేటాయింపు పొందిన ఉపాధ్యాయులకు తీరని నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు.